జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 30-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 497 పేజీలు: 4 వెల : రూ.7

# పలాసలో పడకేసిన.. నిఘా

✳ జంట పట్టణం మెయిన్‌రోడ్డులో దొంగల బీభత్సం ✳ ఏకకాలంలో నాలుగుచోట్ల చోరీ ✳ ఆందోళనలో జంటపట్టణవాసులు ✳ నైట్ డ్యూటీలకు పోలీసులు రాంరాం ✳ పలాస కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ అధికారి తీరుపై విమర్శలు వెల్లువ ✳ పోలీసు సిబ్బంది మధ్య సమన్వయలోపమే కారణం







**శ్రీకాకుళం క్రైం/పలాస, అక్టోబరు29 (వార్త):** కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి ఏకకాలంలో నాలుగుచోట్ల దొంగలు బీభత్సం సృష్టించారు. మెయిన్‌రోడ్డులోని నాలుగు షాపులు కొల్లగొట్టారు. సుమారు ఐదు లక్షల వరకూ నగదును తస్కరించారు. దీంతో జంట పట్టణవాసుల్లో భయాందోలన నెలకొంది. పలాసలో నిఘా పడకేసిందన్న విమర్శలు ఉన్నాయి. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఓ అధికారి తీరు వల్ల పోలీసు సిబ్బంది మధ్య సమన్వయం లేకుండా పోయిందని కొందరు పోలీసులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆ అధికారి తనకు నచ్చిన పోలీసు సిబ్బందితో కలెక్షన్లు తదితర పనులకు వినియోగిస్తున్నారు. మిగతా వారిని బందోబస్తు, నైట్‌డ్యూటీలకు వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నాడట. దీంతో తామే ఎందుకు డ్యూటీలు చేయాలని కొందరు నిరాశతో బందోబస్తు, నైట్ పెట్రోలింగ్‌కు రాం రాం చెబుతున్నారు. ఏదో డ్యూటీ చేశాం.. వచ్చాం అన్న రీతిలో విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీల్లో రాత్రిపూట ఏదో తిరిగాం అన్నట్టు అలా వెళ్లి ఇలా వచేస్తున్నారట. ప్రస్తుతం ముంథా తుఫాన్ వల్ల విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. ఇదే అదునుగా చేసుకుని దొంగలు చేతికి పనిచెప్పారు. పలాస కాశీబుగ్గ మెయిన్‌రోడ్డులోని శ్రీనివాస లాడ్జింగ్ ప్రాంతంలో ఉన్న మందుల షాపులను మంగళవారం అర్ధరాత్రి టార్గెట్ చేసి చోరకి పాల్పడ్డారు. ఏకంగా నాలుగు షాపులను కొల్లగొట్టారు. తంగుడు సాంబమూర్తి మెడికల్ షాప్ తాళాలు పగలగొట్టి రూ 3,60,000 నగదును , సమీపంలో ఉన్న రామకృష్ణ మెడికల్ షాపు తాళాలు పగలగొట్టి రూ 40,000 నగదు చోరీ చేశారు. అలాగే బంక్ సమీపంలో ఉన్న రెండు షాపులలో చోరీకి పాల్పడ్డారు. శ్రీలక్ష్మి మెడికల్ షాపు తాళాలను దొంగలు పగలగొట్టారు. దగ్గరలో ఉన్న ఇంటర్నెట్, ట్రావెల్స్ షాప్‌లో రూ.6000నగదు దొంగలు అపహరించారు. చోరీ జరిగిన షాపుల యజమానులు లబోదిబోమంటూ కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఓ మెడికల్ షాపు యజమాని సురేష్ కుమార్ మాట్లాడుతూ తాము రాత్రి 10.30 గంటల వరకూ షాపును తెరిచి ఉంచామని, బుధవారం ఉదయం బ్యాంకులో జమ చేయడానికి దాచిన డబ్బంతా దోచుకున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత షాపులకు సీసీ కెమెరాలు ఉన్నా వర్షాలు కారణంగా అవి మొరాయించాయి. దీంతో ఎంత మంది దొంగలు దొంగతనానికి పాల్పడింది తెలియడంలేదు. నిత్యం జనం రద్దీగా ఉండే కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి జంక్షన్లో ఇటువంటి దొంగతనం జరగడం, ఇదే ప్రాంతంలో రెండు నెలల క్రితం ఓ మొబైల్ స్టోర్ లో రూ.1.20 లక్షల నగదు ఇదే తరహాలో చోరీకి గురైంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.



# ఆర్టీఐ అమల్లో.. నిర్లక్ష్యం!

✳ శ్రీకాకుళం మున్సిపల్ అధికారులపై శాఖా చర్యలు ✳ పౌరుల హక్కును కాలరాసిన అధికారులకు షాక్! ✳ శాఖా పరమైన చర్యలు కంటే ఇంకా కఠిన చర్యలు తీసుకోవాల్సిందే ✳ పౌర హక్కుల సంఘాలు డిమాండ్ ✳ ఒక్కసారి కూడా సరైన సమాచారం ఇవ్వనేలేదు ✳ ఆర్టిఐ అంటే చులకన ✳ ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం ✳ విజిలెన్స్ దర్యాప్తు షురూ





**శ్రీకాకుళం, అక్టోబరు29 (వార్త):** ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు ప్రతీక అయిన సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) అమలును నిర్లక్ష్యం చేసిన శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ప్రజా సమాచారాన్ని గోప్యం చేస్తూ, పౌరుల హక్కును కాలరాస్తున్న ఇద్దరు కీలక . కారులపై మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ శాఖా విచారణలకు ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులతో అక్రమాలు మొత్తానికి వెలుగు చూశాయి. ఈ వ్యవహారంపై సదరు శాఖ జారీ చేసిన మూడు జీవోలు (ప్రభుత్వ ఉత్తర్వులు) అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. జీవో నం.1191 ప్రకారం, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సి. వేంకటేశ్వరరావు (పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్/అసిస్టెంట్ సిటీ ప్లానర్) వై. వి. శివకుమార్ (ఫస్ట్ అప్పెలేట్ అథారిటీ/ అసిస్టెంట్ కమిషనర్) ఇద్దరిపై కలిపి ఒకే సాధారణ దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని తర్వాత జారీ అయిన జీవో నం.1192 మరియు 1193 లలో... ఈ ఇద్దరి అధికారులపైనా వేర్వేరుగా శాఖా విచారణలు ప్రారంభించాలని




ఆదేశించింది. సమాచార హక్కు కమిషన్ ఆదేశాలను సమయానికి పాటించకపోవడం, ఆర్టీఐ దరఖాస్తులకు తగిన సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వకపోవడం అనేదే ప్రధాన కారణాలు.

## జనం పట్ల నిర్లక్ష్యమే కారణం!

శ్రీకాకుళం మున్సిపాలిటీలో ఆర్టీఐ దరఖాస్తుల పట్ల అధికారులు అసలు పట్టించుకోరనే విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న పౌరులు ఎన్నిసార్లు అప్పీల్ చేసినా... వారిని వేధింపులకు గురిచేస్తూ, సరైన సమాచారం ఇవ్వకుండా దాటవేస్తున్నారనే ఆవేదన వినిపిస్తోంది. "ఆర్టీఐ దరఖాస్తులు అంటే వారికి చాలా హేళన. సంతృప్తికరమైన సమాధానం ఒక్కసారీ ఇవ్వలేదు" అంటూ బాధితులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యలన్నీ కేవలం వ్యక్తిగత అధికారుల నిర్లక్ష్యం మాత్రమే కాకుండా... సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రంలోని మున్సిపల్ సంస్థల్లో నెలకొన్న పారదర్శకత లోపాలను బహిర్గతం చేస్తున్నాయి.

## 15 రోజుల్లో వివరణ ఇవ్వాలి... హెచ్చరికలు జారీ!

ప్రభుత్వం ఈ ఇద్దరు అధికారులకు గట్టి హెచ్చరిక జారీ చేసింది. 15 రోజుల లోపు తమ వాదనలను లిఖిత పూర్వకంగా సమర్పించాలని ఆదేశించింది. అంతేకాకుండా, విచారణను ప్రభావితం చేయడానికి ఎటువంటి రాజకీయ లేదా బయటి ఒత్తిళ్లు తీసుకురావద్దని స్పష్టం చేసింది. ఒకవేళ లిఖిత పూర్వక సమాధానాలు ఇవ్వకపోయినా... అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా విచారణను కొనసాగిస్తామని జీవోలో కరాఖండిగా పేర్కొన్నారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఈ కీలక ఉత్తర్వులను జారీ చేశారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో ఆర్టీఐ దరఖాస్తులను అధికారులు గంభీరంగా తీసుకునేలా చేస్తాయని, ఇది ప్రజా పాలనలో పారదర్శకతను పెంచేందుకు సానుకూల పరిణామం అవుతుందని సీనియర్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ జీవోతోనైనా శ్రీకాకుళం మున్సిపాలిటీలో కళ్లు తెరుస్తారేమో చూడాలి! పౌరులకు న్యాయం జరుగుతుందా లేదా అన్నది ప్రశ్నార్థకమే.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పోతయ్యవలసలో రచ్చబండ

**నరసన్నపేట, అక్టోబరు 29(వార్త):** పోతయ్యవలస గ్రామంలో పోతయ్యవలస-గోపాలపెంట క్లస్టర్ పరిధిలో రచ్చబండ (కార్యకర్తలతో కృష్ణచైతన్య) కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి గ్రామ స్థాయి కార్యకర్త ప్రజలతో సన్నిహితంగా ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికి చేరేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి రేషన్ ఇచ్చే పథకాన్ని ఆపేసి, ఇంటింటికి మద్యం ఇచ్చే పథకం ప్రారంభించిన చంద్రబాబు పాలనను ప్రజలు తిప్పికొట్టాలని ఆయన అన్నారు. కార్యకర్తలపై ఎలాంటి అన్యాయం లేదా ఆక్రమణ జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు రామారావు, మండల అధ్యక్షులు లుకలాపు రవి, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల అరవింద్, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, సర్పంచ్లు కనపల సత్యప్రియ, ఎండ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# 2025 హెక్టార్లలో పంటకు నష్టం

*** జిల్లాలో 4801 మంది రైతులు ప్రభావితం * రూ.1.24 కోట్ల తాత్కాలిక నష్టం * క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఆయా శాఖల అధికారులు * పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేస్తున్న యంత్రాంగం**

**శ్రీకాకుళం, అక్టోబరు 29 (వార్త):** మొంథా తుఫాన్ కారణంగా జిల్లావ్యాప్తంగా వరి పంటకు భారీ నష్టం వాటిల్లింది. తుఫాన్ వల్ల పొలాల్లో నీరు నిలవడం, ఈదురు గాలుల కారణంగా మొత్తం 2,025 హెక్టార్లలోని పంట దెబ్బతింది. ఈ విపత్తు కారణంగా సుమారు 4,801 మంది రైతులు ప్రభావితమైనట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా నివేదికలో వెల్లడించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం, జిల్లాలోని 13 మండలాల్లోని 120 గ్రామాల్లో పంట నష్టం సంభవించింది. నీట మునిగిన/దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా వరి పంటకే అధిక నష్టం జరిగింది. మొత్తం దెబ్బతిన్న 2,025 హెక్టార్లలో 2,021 హెక్టార్లు వరి పంట కాగా, కేవలం 5 హెక్టార్లు మాత్రమే ఇతర పంటలు ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలంలో అత్యధికంగా 1,118 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ఇక్కడ 2,963 మంది రైతులు ప్రభావితమయ్యారు. పాతపట్నం మండలంలో 168 హెక్టార్లలో పంట నష్టం జరిగి, 320 మంది రైతులు , నందిగాం మండలంలో 150 హెక్టార్లలో పంట నష్టం జరిగి, 302 మంది రైతులు, వజ్రపుకొత్తూరు మండలంలో 213 హెక్టార్లలో పంట దెబ్బతిని, 372 మంది రైతులు రైతులు నష్టపోయారు. ఎచ్చెర్ల మండలంలో 6 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తుది నష్టం అంచనా తర్వాత రైతులను ఆదుకునేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

**జిల్లాకు రూ.1.24 కోట్ల తాత్కాలిక నష్టం**

జిల్లాలోని వివిధ శాఖలలో సుమారు రూ.124.89 లక్షల (రూ. 1.24 కోట్లు) మేర తాత్కాలిక నష్టం వాటిల్లినట్లు జిల్లా యంత్రాంగం బుధవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. తుఫాన్ ప్రభావం జిల్లాలోని 10 మండలాల్లోని 53 గ్రామాల్లో తీవ్రంగా ఉంది. మానవ ప్రాణనష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మొత్తం 30 సహాయక శిబిరాలను నిర్వహించి, 832 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సహాయక చర్యల కోసం ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది, అలాగే ప్రజారోగ్య పరిరక్షణ కోసం జిల్లావ్యాప్తంగా 153 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. నిరాశ్రయులైన వారికి 1,000 ఆహార పొట్లాలు, 2,000 తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. తుఫానుతో జిల్లాలో మొత్తం 2,230.29 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. దీనివల్ల సుమారు 4,801 మంది రైతులు నష్టపోయారు. వరి పంటకు 2,227.5 హెక్టార్లలో, ఉద్యాన పంటలకు 2.79 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. ఇచ్ఛాపురం మండలంలో అత్యధికంగా 1,118 హెక్టార్లలో వరి పంట నష్టం జరిగింది. విద్యుత్ శాఖ (ఏపీపీడీసీఎల్)లికు రూ.11.73 లక్షల అంచనా నష్టం వాటిల్లింది. మొత్తం 11 కేవీ స్తంభాలు 36, తక్కువ వోల్టేజి (ఎల్టి) స్తంభాలు 53 నేల కూలగా, 27 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. ఏపీఈడీసీఎల్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి, రూ.11,93,935 వ్యయంతో పునరుద్ధరణ పనులను పూర్తి చేశారు. ఆర్అండ్‌బి శాఖ పరిధిలో 16.38 కి.మీ. మేర రోడ్డు దెబ్బతిని రూ.90 లక్షల నష్టం వాటిల్లింది. పంచాయతీరాజ్ (పి ఆర్) శాఖ పరిధిలో 0.106 కి.మీ. రోడ్లకు నష్టం జరిగి రూ.15 లక్షల తాత్కాలిక నష్టం వాటిల్లింది. తుఫాన్ ధాటికి మొత్తం 44 ఇళ్లు దెబ్బతిన్నాయి. వీటిలో 7 ఇళ్లు పూర్తిగా ధ్వంసం కాగా, 34 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇళ్ల నష్టం అంచనా విలువ రూ.7.06 లక్షలుగా ఉంది. పశు నష్టం కింద ఒక పశువు, 8 చిన్న జంతువులు మరణించగా, అంచనా విలువ రూ.1.1 లక్షలుగా ఉంది. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఈ నష్ట నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయ వర్గాలు నష్ట నివేదికను రూపొందించాయి.



## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మాజీ మంత్రి సీదిరి పర్యటన

**పలాస/వజ్రపుకొత్తూరు, అక్టోబరు 29 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలంలోని సీతాపురం-బొడ్డాపాడు పరిధిలో ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా బెండుగడ్డ నుండి వచ్చే వరద నీరు పంటపొలాల్లోకి చేరి సుమారు 200 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. పంటలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించిన మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు బుధవారం ప్రభావిత ప్రాంతాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. పంట నష్టాలపై సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నష్టపోయిన ప్రతి రైతుకూ తక్షణ నష్టపరిహారం చెల్లించాలని, ఇన్పుట్ సబ్సిడీ పూర్తి స్థాయిలో అందించాలి" అని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డిల్లీరావు, మాజీ సర్పంచ్ ఉప్పాడ ఆనంద్, ఎంపీటీసీ కామేశ్వరరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పోటీలకు టెన్నికాయిట్ జిల్లా జట్టు నేడు ఎంపిక

**పలాస, అక్టోబరు 29(వార్త):** పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం 18 ఏళ్ల లోపు విభాగంలో బాల బాలికల టెన్నికాయిట్ ఎంపికలు నిర్వహించబడునని శ్రీకాకుళం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్ కుమార్, సుడియా వెంకట జోగారావు, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి. తవిటయ్య తెలియజేశారు. ఈ ఎంపికలలో పాల్గొను క్రీడాకారులు 01.01. 2007 తర్వాత పుట్టిన వారై ఉండాలని, ఎంపికలకు వచ్చే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రము, ఆధార్ కార్డు, నాలుగు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో 7, 8,9 తేదీలలో బాపట్ల జిల్లా చీరాలలో జరుగు రాష్ట్ర పోటీలలో పాల్గొందురని పి.తవిటయ్య తెలియజేశారు.

## మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కూటమి నేతల పర్యటన



**పలాస, అక్టోబరు 29(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు బుధవారం పలాస నియోజకవర్గం లోని పెద్దబాడం, శివరాంపురం, కంబిరిగాం, బ్రహ్మణతర్లా ప్రాంతంలో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడం వలన ప్రభావిత ప్రాంతాలను పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నాయకులతో పర్యటించారు. వారితో పాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి నవీన్ సప్ప, పీరికట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు, జనా అప్పారావు, సారా, నోములు, మల్లేష్, చిన్ని, కోర్ల విష్ణు, శశిబూషణ్, దువ్వాడ శ్రీహర్ష, సంతోష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## జగదానందకారుడు.. వాసుదేవుడు



**మందస, అక్టోబరు 29(వార్త):** వాసుదేవుని మోహనాకారం వర్ణనాతీతం.. జగదానందకారుడైన వాసుదేవుడు భక్తులకు కొంగుబంగారం.. మూలవిరాట్ అయినా.. అలంకారుడైనా.. వాసుదేవుని దర్శనం దివ్యానుభూతిని కలిగిస్తుంది. శ్రీనివాసుని దివ్యమూర్తిని తలపించే శ్రీమన్నారాయణుడుని మూర్తిత్వం భక్తులకు తన్మయత్వం కలిగించింది. ప్రధాన అర్చకులు, వేద పండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వాసుదేవ పెరుమాళ్ నిజరూపానికి అభిషేకంకావించి, దివ్యాలంకృతుని కావించారు. అలంకరణలో స్వామివారు.. జగదానందకారుడై.. ముల్లోకాలను ఏలే శ్రీమన్నారాయడై.. కలియుగదైవమై.. భక్తులకు కనువిందు చేశాడు. స్వామివారిని దర్శించుకుని, భక్తులు భక్తి, తన్మయత్వం చెందారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# వీడని మొంథా తుఫాన్ భయం

*** పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు * గిరిజన ప్రాంతాల్లో కూడా వరి పంటకు నష్టం* ఎగిరిపోయిన పూరిళ్లు**





**మందస, అక్టోబరు 29(వార్త):** మొంథా తుపాను భయం ఇంకా వీడడంలేదు. కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఉద్దానంలో జీడి, మామిడి, కొబ్బరి చెట్లు కూలిపోయాయి. గిరిజన ప్రాంతాల్లో మట్టి, పూరిళ్లు ఈదురు గాలులకు ఎగిరిపోయాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో కొన్ని చోట్ల నీటి ప్రవాహం కొనసాగుతునే ఉంది. అధికార, ప్రతిపక్ష నాయకులు బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ప్రాణ నష్టం జరుగక పోయినప్పటికీ, ఆస్థినష్టం జరిగింది. తుపానుకు కొంతమంది నిరాశ్రయులుగా మారాయి. మందస మండలంలోని బెల్లుపటియా వద్ద మహేంద్రతనయ(కళింగదళ్) నీటి ప్రవాహం ఉధృతి కొనసాగుతుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురవుతున్నారు. చీపి పంచాయతీలోని బొందికరి అనే గిరిజన గ్రామం వద్ద నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో పాతబ్రిడ్జి కూలిపోతుందోనేమోనని గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారు. మందస మండలంలోని ఉద్దానం, మైదాన, గిరిజన, పల్లపు ప్రాంతాలకు మొంథా తుఫాను నష్టం మిగిల్చింది. ప్రభుత్వం స్పందించి, బాధితులను ఆదుకోవాలని కోరుతున్నారు.





## వరహాల గెడ్డలో పడి టాక్టర్ డ్రైవర్ గల్లంతు

**పలాస, అక్టోబరు 29 (వార్త):** మండలంలోని కంబిరిగాం వద్ద వరహాల గెడ్డలో బుధవారం పలాస మండలం దానగొరకు చెందిన సవర లావణ్ (లవన్న) అనే ట్రాక్టర్ డ్రైవర్ పడి గల్లంతయ్యాడు. పలాస నుంచి కంబిరిగాంకు వెళ్తు వరహాలగెడ్డ కాజ్ వే దాటుతుండగా ఈఘటన చోటుచేసుకుంది. వరద ఉధృతికి గెడ్డలో లావణ్ కొట్టుకు పోయినట్టు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకున్నారు. పలాస తహశీల్దార్, రెవెన్యూ అధికారుల బృందం ఫైర్ సిబ్బంది గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. గల్లంతయిన సవర లావన్న కోసం ఆర్డిఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వేపకర్ర చెరువును పరిశీలిస్తున్న అధికారులు



**జి.సిగడాం, అక్టోబరు 29(వార్త):** మొంథా తుఫాన్ జిల్లా ప్రజలను టెన్షన్ పెడుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలు చెరువులు, గెడ్డలు జలమయమయ్యాయి. వల్లపు ప్రాంతాల్లో వరి పంటలు వరద నీటిలోనే ఉన్నాయి. ఎస్పీఆర్ పురం సమీపాన వేప కర్ర చెరువు గండి కొట్టడంతో హుటాహుటన సర్పంచ్ కంది రమాదేవి, మండల ప్రత్యేక అధికారి చంద్ర జీవన్, ఎంపీడీవో జి. రామ కృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, పంచాయతీ కార్యదర్శి కోంచాడ శ్రీనివాస రావు చెరువు గండి ప్రదేశాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు అక్కడ పరిస్థితిని తెలియజేశారు. రానున్న రోజుల్లో చెరువు అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బగ్గు



**పోలాకి, అక్టోబరు 29(వార్త):** నీట మునిగిన పంట పొలాలకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆ పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం చెల్లించే పరిహారం పంట నమోదు ప్రక్రియను త్వరతిగతిన పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన పోలాకి మండలం ప్రియాగ్రహారంలో ముంపునకు గురైన పొలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సాంఘిక సంక్షేమ శాఖ**

**బాలికల వసతిగృహ సందర్శన**

**జలుమూరు:** జలుమూరులో బాలికల వసతి గృహంలో తుఫాన్ కారణంగా కూలిపోయిన ప్రహరీ గోడను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరిశీలించారు. మిగిలిన గోడ నాణ్యతను అధికారులు పరిశీలించిన అనంతరము పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వసతి గృహంలో కలియతిరిగి, విద్యార్థుల సదుపాయాలపై ఆరా తీశారు. వసతి గృహంలోని నేల భావిని పరిశీలించి బాగు చేయించాలని సూచించారు. అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దుంగ స్వామిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, మునికోటి దాంబాబు, బగ్గు గోవిందరావు, అక్కా జోస్యుల దత్తుబాబు, రెడ్డి జయరాం, మునికోటి గంగాధర్, గొలివి బాలకృష్ణ, తహశీల్దార్, ఎంపీ డీవో, కూటమి నాయకులు, కార్యకర్తలు, మండల, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## పైడిగాం ఛానల్‌కు గండి..పూడ్చేందుకు చర్యలు



**సోంపేట/ కంచిలి, అక్టోబరు 29(వార్త):** కంచిలి మండలం జి.నారాయణపురం వద్ద పైడిగాం ఛానల్ కు భారీ గండి పడింది. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు కాలువకు గండి పడటంతో వరి పంటకు 3 ఏర్పడే పరిస్థితి నెలకొంది. దీంతో హుటాహుటిన చర్యలు చేపట్టాలని భావించి కంచిలి మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ సూర్య ప్రకాష్ అక్కడికి చేరుకున్నారు. గండిని పరిశీలించి పంటకు నష్టం వాటిల్లకుండా త్వరితగతిన పూడ్చి పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ సూర్య ప్రకాష్ తెలిపారు వీరితోపాటు వీఆర్వో వెంకటరమణ, నీటి సంఘం అధ్యక్షుడు చిరంజీవి, సారి ఆనంద్, శాంతారావు, హరిబాబు, భాస్కరరావు తదితరులు ఉన్నారు.

## సోంపేట హైస్కూల్లో కూలిన చెట్లు



**సోంపేట, అక్టోబరు 29(వార్త):** సోంపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తుఫాను ప్రభావంతో మంగళవారం రాత్రి రెండు పెద్ద చెట్లు కూలిపోయాయి. ఈ పరిస్థితిని గమనించిన ప్రధానోపాధ్యాయుడు చెట్లను తొలగించాలని తహసీల్దార్ అప్పల స్వామిని కలిసి విన్నవించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ సూర్యారావు సిబ్బందితో కలిసి బుధవారం రంగంలోకి దిగారు. తమ వద్ద గల యంత్ర పరికరాలతో ఫైర్ అధికారులు సిబ్బంది చెట్లను తొలగించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు .. అగ్నిమాపక అధికారులను అభినందించారు.

## నష్టపోయిన రైతు కుటుంబాలకు అండగా ఉంటాం



**వీరఘట్టం, అక్టోబరు 29(వార్త):** వీరఘట్టం మండలంలో మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని, ఈ విషయంలో రైతులు దిగులు చెందవలసిన అవసరం లేదని వీరఘట్టం మండలం టిడిపి పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్ రైతులకు భరోసా ఇచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాలతో బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీరఘట్టం టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణతో కలిసి పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించడంతో ప్రాణనష్టంగాని ,ఆస్తి నష్టం గాని జరగకుండా ఉండడం గొప్ప విశేషమేనని అన్నారు. ఆరుగాలాలపాటు పండించే రైతన్నలు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదని, ఆ దిశలోనే కూటమి ప్రభుత్వము ముందుకు వెళుతుందని ఆయన చెబుతూ, మండలంలో తమ బృందం పర్యటించి పంట నష్టాలను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గారి తో పాటు అధికారులకు కూడా విన్నవిస్తామని ఆయన అన్నారు. మొంథా తుఫాన్ కారణం గా మండలంలోని వివిధ గ్రామాలలోని నష్ట పోయిన ఉద్యానవన, వరి రైతుల పంట పొలాలను ఉద్యానవన, వ్యవసాయ అధికారులతోకలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్ట పోయిన పంటలను పరిశీలించారు. ముఖ్యంగా మండల కేంద్రం వీరఘట్టంలో కూరగాయల పంటలు అత్యధికంగా పండిస్తారని అయితే ఈ మొంథా తుపాను పుణ్యమా అంటూ చాలా వరకు పంట నష్టం జరిగిందని వారు అన్నారు. ఈ సందర్బంగా నష్టపోయిన రైతులకు శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ తరుపున వారికి భరోసాను అందజేశారు. అలాగే ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం ఇప్పించే దిశగా తగు చర్యలు తీసుకుంటామని వారు రైతులకు అభయమిచ్చారు. వీరితో పాటుగా కూటమి నాయకులు జంపు శేఖర్, సరిపెళ్ళ అచ్యుత్, నులకజోడు ఇషాక్, కర్నెన సాయి, శివ క్షేత్ర స్థాయిలో పర్యటించిన వారిలో వున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల చెంత..మురుగునీటి చింత.!



**నరసన్నపేట, అక్టోబరు 29(వార్త):** నరసన్నపేటలోని ప్రభుత్వ కార్యాలయాలు చెంత మురుగునీటి చింత అని ఉద్యోగులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప ఖజాన, తహశీల్దార్, పోస్టాఫీస్, పోలీస్ స్టేషన్కు వచ్చేవారు ఈ మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఈ సమస్య ఉత్పన్నమవుతుందని, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నీట మునిగిన పొలాలను పరిశీలించిన శాంతి



**కొత్తూరు, అక్టోబరు 29(వార్త):** 'మొంథా' తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా నీలకంఠాపురం గ్రామ పరిధిలో వరి, పత్తి పంటలు పూర్తిగా నేలకూలిపోయి వర్షపు నీటిలో మునిగిపోయాయి. ఈ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మరియు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి గారు బుధవారం గ్రామాన్ని సందర్శించారు. స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రభావిత పొలాలను పర్యవేక్షించిన ఆమె, తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న రైతులను పరామర్శిస్తూ మానసిక ధైర్యం నూరిపోశారు. రైతులు చేతికొచ్చిన పంట కళ్ల ముందే విరిగి నీటిలో కలిసిపోయిందని కన్నీరు మున్నీరయ్యారు. తమ పెట్టుబడులు మొత్తం మునిగిపోయాయని, ఇప్పుడు జీవనోపాధి సంక్షోభంలో ఉన్నామని తెలుపారు. పరిస్థితిని స్పష్టంగా గమనించిన రెడ్డి శాంతి గారు, తక్షణమే అధికారులు నష్టపరిహార అంచనాలు పూర్తి చేసి, ప్రభావిత రైతన్నలకు ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గండివలస ఆనంద్,ఎంపిటిసి వనుము లక్ష్మీనారాయణ, మఠం పూర్ణ,పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## అంతా ప్రశాంతం..ఊపిరి పీల్చుకున్న అధికారులు

**వీరఘట్టం, అక్టోబరు 29(వార్త):** మొంథా తుఫాన్ దూసికొచ్చిన వేళ , ఉన్నతాధికారుల ఆదేశాలతో అప్రమత్తమైన మండల శాఖ అధికారులు. మూడు రోజులపాటు అధికారులు క్షణం తీరిక లేకుండా ఇటు ప్రజలను అటు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ముందుకు సాగారు. అయితే బుధవారం సాయంత్రం నుంచి తుఫాన్ గండం గట్టెక్కడంతో అంతా ప్రశాంతంగా ఉండడంతో హమ్మయ్య... అంటూ ఊపిరి పీల్చుకున్నారు అధికారులు. నదీ తీర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సందర్శిస్తూ ప్రజలకు తుఫాన్‌పై అవగాహన కల్పిస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టారు తహాశీల్దారు ఏ.సాయి కామేశ్వరరావు, ఎంపీడీవో బి.వెంకటరమణ, ఎస్సై జి.కళాధర్, మండల వ్యవసాయ శాఖ అధికారి సౌజన్య. వీరిని మండల ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

## 400 ఎకరాల్లో పంట నష్టం



**మెళియాపుట్టి, అక్టోబరు 29(వార్త):** మొంథా తుఫాను ప్రభావం కారణంగా పంట నీట మునిగి ప్రాథమిక అంచనా నివేదికలను బట్టి సుమారు 400 ఎకరాల వరకు పంటకు నష్టము వాటిల్లినట్లు తెలుస్తుంది. మొంతా తుఫాను కారణంగా లాడ్జింగ్ మరియు ముంపు అయిన వరి పంట పొలాలను మండల వ్యవసాయధికారి దానకర్ణుడు, సిబ్బందితో కలిసి బుధవారం నాడు బందపల్లి, నీలాపురం, జోడూరు, మారేడుకోట కరజాడ, చంపాపురం తదితర గ్రామాలను సందర్శించి పరిశీలించారు. మండలంలో సుమారుగా 400 ఎకరాల వరకు వరి పంట నష్టం ఉన్నట్లు ప్రాథమిక అంచనా నివేదికలను పై అధికారులకు పంపించడం జరిగిందిన్నారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తూనే, తుఫానుతో ప్రభావిత పంట నీట మునిగి నష్టపోయిన రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. పడిపోయిన వరిచేలను నిలబెట్టి కట్టలు కట్టలుగా కట్టాలని, తదుపరి ఎకరాకి ఒక కేజీ గడ్డ ఉప్పును వరి చేను పైన పిచికారి చేసినట్లయితే గింజ మొలకేత్తకుండా మరియు రంగు మారకుండా ఉంటుందని తెలిపారు. అలాగే ప్రొఫి కొనజోల్ ఎకరాకి 200ఎం.ఎల్ ను కలిపి పిచికారి చేసుకున్నట్లయితే పాము పొడతెగులు రాకుండా పంటను కాపాడుకోవచ్చుని, అలాగే ప్లాంటమైసిన్ 200 ఎం.ఎల్ ఒక ఎకరాకి పిచికారి చేసుకున్నట్లయితే బ్యాక్టీరియా, ఎండు తెగుళ్ల నుండి కాపాడుకోవచ్చు అన్నారు.ఈ సందర్భనలో వీఏఏ వాసవి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన కల్వర్టు

**-పలాసపురం వద్ద రాకపోకలకు తీవ్ర సమస్య**

**సోంపేట, అక్టోబరు 29(వార్త):** సోంపేట మండలం పలాసపురం గ్రామం మీదుగా జాతీయ రహదారికి వెళ్లే రహదారి మధ్యలో గడ్డ వద్ద భారీ వర్షాలకు కల్వర్టు కూలిపోయింది. ఈ పరిస్థితిని బుధవారం స్థానిక సర్పంచ్ తాడక జోగా రావు, జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద కలసి పరిశీలించారు. కల్వర్టు కూలి పోవడంతో రాకపోకలకు తీవ్ర సమస్యగా మారిందన్నారు. సంబంధిత అధికారులతో వారు మాట్లాడారు. త్వరితగతిన రహదారిని పునరుద్ధరించాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వృద్ధురాలిపై దాడి.. బంగారు ఆభరణాల చోరీ

**సారవకోట, అక్టోబరు 29(వార్త):** ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై గుర్తు తెలియని అగంతకులు దాడి చేసి గాయపరచడం తోపాటు బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన జరిగింది. సారవకోట మండలం బుడితి గ్రామంలో ఉంటున్న నిక్కు చల్లాయమ్మపై మంగళవారం తెల్లవారుజామున అగంతకులు దాడి చేశారు. ఆమె వద్ద ఉన్న అరతులం బంగారు ఆభరణాలు చోరీ చేసి గాయపరిచారని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. ఆమెను బుడితి హాస్పిటల్లో చేర్పించి వైద్య సహాయం అందజేస్తున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## వంశధార స్నాన ఘట్టాన్ని పరిశీలించిన ఈవో

**జలుమూరు, అక్టోబరు 29(వార్త):** శ్రీముఖలింగం గ్రామం సమీపంలో ఉన్న వంశధార నది బాలి యాత్ర స్నాన ఘట్టాన్ని మంగళవారం శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ ఈవో ఏడుకొండలు పరిశీలించారు. కలెక్టర్ సూచనల మేరకు బాలి యాత్ర జరిగే వంశధార నది ముఖ్య స్నానఘట్టం రేవుని మెరుగుపరిచయమని అన్నారు. వంశధార రేవు వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఆలయ అనువంశిక అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ ఉన్నారు.

## తుఫాన్‌తో నేలకు ఒరిగిన వరి పంట



**జలుమూరు, అక్టోబరు 29(వార్త):** తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది రైతుకు ఇబ్బందులు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలుమూరు మండలంలోని పలు ప్రాంతాలలో వరి పంట నేలకు ఒరిగిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆది నుంచి ఇటువంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నామని, పంట చేతికి వచ్చేవరకు నమ్మలేని పరిస్థితి ఏర్పడిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వరద బాధితులకు ఇప్పిలి, గుమ్మడి సాయం



**సోంపేట/ కంచిలి, అక్టోబరు 29(వార్త):** తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కంచిలి మండలం గిరిజన గ్రామమైన నువగడలో ఇంటి గోడలు కూలి పోయి నిరాశ్రయులైన బాధితులకు జడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, మాజీ సహకార సొసైటీ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు బుధవారం 3000 రూపాయల నగదు సహాయం అందించి ఆ నిరుపేద కుటుంబానికి బాసటగా నిలిచారు. ఈ సహాయాన్ని జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కోటను ప్రభుత్వం వెంటనే స్పందించి ఇటువంటి బాధితులకు వెంటనే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా జడ్పీ చైర్ పర్సన్ విజయ స్వతహాగా బాధితులకు దుప్పట్లు, చీరలు, వంట సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబితా, ఎస్ ఆర్ సి పురం సర్పంచ్ ప్రతినిధి డోక్కరి బలరాం, బుషి తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైసీసీ నేతల పర్యటన

**పలాస, అక్టోబరు 29(వార్త):** మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, కేటి రోడ్డు మోర్ షాప్ ఎదురుగా వరద కాలువపైన నిర్మాణాలతో వర్షం పడిన ప్రతిసారి ఆ ప్రాంతం లో రోడ్డు పైన వరద నీరు నిలువ ఉండి ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారని, పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వతమైన పరిష్కారం చూపుతారని పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విన్నవించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, మునిసిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బడగల.బల్లయ్య, పలాస ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, కౌన్సిలర్ జోగి సతీష్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు నర్తు వెంకటరమణ, నాయకులు పినకాన ముకుంద, గజ్జి బాలయ్య పాల్గొన్నారు.



# నడుకూరు పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

**వీరఘట్టం, అక్టోబరు 29(వార్త):** మొంథా తుఫాన్ పుణ్యమా అంటూ మండలంలోని నడుకూరు గ్రామంలో లోని ఎంపీ యుపీ పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో పాఠశాలంతా జల మయమైంది. మూడు రోజులపాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించటంతో ఉపాధ్యాయులు ఆ పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదు. అయితేబుధవారం జలమయమైన పాఠశాల దృశ్యాలను కొందరు గ్రామస్తులు మీడియా దృష్టికి తీసుకురావడంతో బహిర్గతమైంది. ఇదే పాఠశాలలో గత 10 ఏళ్లుగా వర్షం కురిస్తే నీటమునుగుతూ ఉండటం ఆనవాయితీగా వస్తుంది . అయితే ఇదేవిషయాన్ని గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ లకు విద్యార్థులు, గ్రామ ప్రజలకు సంబంధిత అధికారులకు అనేక పర్యాయాలు విన్న వించుకున్నా సమస్య పరిష్కారం జరగలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల పూర్తిగా వర్షం నీటితో నిండిపోయింది. గతంలో అప్పటి జె.సి సుమిత్ కుమార్ వచ్చి పాఠశాల ను సందర్శించారు , ప్రధాన రహదారి ప్రక్కన కాల్వల నిర్మాణం చేపట్టాలని, ఆక్రమణ లను తొలగించాలని ఆదేశించారు, అయినప్పటికీ గ్రామ సర్పంచ్ గాని అధికారులు గాని చర్యలు తీసుకొన్న దాఖలాలు లేవు. అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న ఇటువంటి పాఠశాలలు ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలని ఎలా పాఠశాల కు పంపిస్తామని ప్రజలు ఎదురు ప్రశ్నిస్తున్నారు. అయితే పాఠశాలల్లోకి నీరు చేరింది అన్న విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి బి. కోటేశ్వరరావు



తక్షణమే స్పందించి జెసిబి సాయంతో కాలువను క్లియర్ చేయించి పాఠశాలలో నీరు బయటకు పోయే విధంగా ఏర్పాటు చేశారు .ఈయన తక్షణమే స్పందించిన తీరుకు నడుకూరు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీదిరి పర్యటన



**పలాస, అక్టోబరు 29(వార్త):** ఇటీవలి తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పలాస మండలంలోని సున్నాడ, శాసనం, రాజగోపాలపురం గ్రామాల్లో పంటలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. ఈ ప్రభావిత ప్రాంతాలను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం ప్రత్యక్షంగా పర్యటించారు. ఇటీవల శాసనం వద జాతీయ రహదారి నుండి రాజగోపాలపురం వరకు నిర్మించిన కొత్త బీటీ రహదారిపై నీరు మళ్లించే ప్రాంతాల్లో చిన్న గొట్టాలు మాత్రమే ఏర్పాటు చేయడంతో ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరదనీరు సక్రమంగా పారిపోకపోవడం వల్ల నీరు నిల్వ అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా శాసనం గ్రామంలో సుమారు 20 ఎకరాలు, సున్నాడలో 20 ఎకరాలు, రాజగోపాలపురం పరిసర ప్రాంతాల్లో వందలాది ఎకరాల వ్యవసాయ భూములు ముంపుకు గురై, పంటలు నష్టపోయాయి. ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించిన డాక్టర్ సీదిరి అప్పలరాజు, నష్టపోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇన్పుట్ సబ్సిడీ వెంటనే అందించాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి,రాష్ట్ర బూత్ కమ్యూనిటీ జాయింట్ సెక్రెటరీ చింతడ మాధవరావు. జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, ఎక్స ఎంపీపీ,జిల్లా కార్యదర్శి బత్తిని హేమేశ్వరరావు గారు జిల్లా కార్యదర్శి బత్తిని హేమేశ్వరరావు గారు చించల పెనుకాన ముకుంద, సున్నాడు గ్రామస్తులు, శాసనం గ్రామస్తులు ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాకివలసలో 'కార్యకర్తలతో కృష్ణచైతన్య'

**నరసన్నపేట, అక్టోబరు 29(వార్త):** మాకివలస గ్రామంలో మాకివలస%-%కీళ్ళాం క్లస్టర్ పరిధి రచ్చబండ (కార్యకర్తలతో కృష్ణచైతన్య) కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో యువ నాయకులు డా. ధర్మాన కృష్ణచైతన్య గారు పాల్గొని కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమ పథకాల అమలుపై సవివరంగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు రామారావు, మండల అధ్యక్షులు లుకలాపు రవి, నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల అరవింద్, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, సర్పంచ్ రావాడ మోహన్ తదితర ప్రజా



ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. రచ్చబండ కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగగా, గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# ఎర్ర చెరువుకు పోటెత్తిన వరద నీరు

**పలాస, అక్టోబరు 29(వార్త):** వరద వరదనీరు దిగువకు ప్రవహించే సామర్థ్యం లేకపోవడంతో పోటెత్తిన నీరుతో ప్రజలు ఇబ్బంది పడ్డారని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన పలాస ఎర్ర చెరువు పూర్తిగా నిండి వ్యవసాయ పొలముల ద్వారా కేటీ రోడ్డునకు వరద నీరు అధికంగా చేరడం వలన ఆ ప్రాంతమంతా 2 రోజులుగా జలమయమై పోయి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో కమిషనర్ నడిపేన రామారావు తన సిబ్బందితో, జెసిబి సహాయం తో సదరు వర్షపు నీటిని కాలువల ద్వారా బుధవారం మళ్ళించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వెనుక గల విద్యుత్ స్తంభములు వర్షమునకు ప్రమాదకరంగా మారడంపై విద్యుత్ శాఖను అప్రమత్తం చేసి సదరు స్తంభములను ప్రమాదకర పరిస్థితుల నుంచి తప్పించడం జరిగిందని, జంక్షన్ లలో గల కల్వర్టుల కవర్ స్లాబ్ లను ఓపెన్ చేసి కాలువ ల లోపల గల చెత్తను




జెసిబిల సహాయంతో క్లియర్ చేయించి కాలువల ద్వారా నీరు సక్రమంగా వెళ్ళేటట్టుగా చేయించడం జరిగిందని కమిషనర్ నడిపేన రామారావు తెలియజేశారు.

## హాస్టల్లో కూలిన ప్రహరీ



**జలుమూరు, అక్టోబరు 29(వార్త):** జలుమూరు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహ ప్రహరీ గోడ కూలిపోయింది. మంగళవారం సాయంత్రం పడిన వర్షాలకు ఈ ఘటన జరిగినట్లుగా అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని మండల ప్రత్యేక అధికారి అరుంధతి దేవి, ఎంఈఓ బమ్మిడి మాధవరావు వెళ్లి పరిశీలించారు. పురాతన ప్రహరీ కావడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అయితే ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# వీరఘట్టం పోలీక్‌స్టేషన్

**-పెచ్చులూడుతున్న శ్లాబ్ - కారిపోతున్న వైనం**

**వీరఘట్టం, అక్టోబరు 29(వార్త):** అందరికీ రక్షణ కల్పించే రక్షక భటులకే పోలీస్ స్టేషన్లో కాసింత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. మొంథా తుపాన్





కారణంగా వీరఘట్టం పోలీస్ స్టేషన్ స్లాబ్ లీకుల మయమై కారిపోతుంది. దీంతో పోలీస్ స్టేషన్లో ఉన్న సిబ్బంది అసహానానికి గురవుతున్నారు స్లాబ్లు పెచ్చు లూడి ఎప్పుడు ఎక్కడ పడిపోతుందని సిబ్బంది తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు అందరకు రక్షణ కల్పిస్తున్న పోలీస్ సిబ్బందికే పోలీస్ స్టేషన్లో రక్షణ కరువుగా నిలిచింది ఈ విషయంలో ఉన్నతాధికారులు కల్పించుకొని భవన నిర్మాణానికి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

# కంబిరిగాం, బ్రాహ్మణతర్ల లక్ష్మీపురం వద్ద వరద ఉధృతి

**పలాస, అక్టోబరు 29(వార్త):** పలాస మండలంలో మోంతా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా ఖంభారిగం వద్ద ఉన్న వరహాల గడ్డ వంతెన వద్ద వరద నీరు తీవ్రంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరదలలో ట్రాక్టర్ డ్రైవర్ సవర లావణ్య గల్లంతయ్యాడనే సమాచారం తెలుసుకున్న వెంటనే జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పండా సంఘటన స్థలానికి చేరుకుని, కాశిబుగ్గ పోలీసు శాఖ, ఫైర్ సిబ్బందితో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఆయన బ్రాహ్మణ తర్ల లక్ష్మీపురం వద్ద ఉన్న వంతెనలను కూడా పరిశీలించి, అక్కడి ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని, ఎవరూ



అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రాజకీయాలకతీతంగా ప్రతీ వార్డు అభివృద్ధి చేశాం

**-నాలుగేళ్లలో రూ.30 కోట్ల పనులు**

**-మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు**

**పలాస, అక్టోబరు 29(వార్త):** ప్రతి వార్డు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేశామని, నాలుగేళ్లలో 30 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస పురపాలక సంఘ భవనంలో బుధవారం పలాస మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ త్వరలోనే పదవి కాలం ముగుస్తుందని, ఇప్పటికైనా అభివృద్ధి పనులు పై దృష్టి పెట్టాలని, అధికారులు ప్రజలు తీసుకువస్తున్న సమస్యలపై స్పందిస్తున్న తీరును అభినందించారు. పార్టీలకు అతీతంగా మున్సిపల్ చైర్మన్ ప్రతి వార్డు అభివృద్ధి చేస్తూ కౌన్సిలర్ కుప్రోత్సస్తున్నారని, అందుకు పలాస ఎమ్మెల్యే సహకారం కూడా ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయం చేసుకొని టెండర్లు పూర్తిచేసి టెండర్లకుపిలవాలని కోరారు. కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ చిన్న చిన్న పనులకు నిధులు మంజూరు చేస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మున్సిపాలిటీ 2021 తో ప్రారంభమైన సీఆర్లోకు మోక్షం కలగలేదని,అత్యవసర పనులు చేపట్టడానికి సి ఆర్ లు తీసుకుంటున్నామని, వాటికి 15వ ఫైనాన్స్ నిధులతో కాకుండా జనరల్ ఫండ్ కాకుండా నిధులతో చెల్లించాలని కోరారు. తదుపరి తాళపత్ర రహదారిని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. పలాస ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తే కొత్తగా వచ్చామని, కొంత సమయం కావాలని చెప్పారు. కొత్త టెండర్లు పిలవాలని, ఆ కాంట్రాక్టులకు నిధులు వస్తే గాని పనులు చేయలేమని చెప్పారని సభ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఇచ్చిన టెండర్లకు సంబంధించి జనవరి ఫండ్ ఇవ్వాలని, ఈ సమావేశంలోనే టేబుల్ ఏజెండగా ప్రవేశపెట్టాలని చైర్మన్ ఆదేశించారు. దీనిపై కౌన్సిలర్ జోగారావు స్పందిస్తూ అధికారులు కౌన్సిలర్ ల మాట వినుకొండ సొంత నిర్ణయాలు తీసుకుంటే మేమెందుకు రావాలని మండిపడ్డారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఎప్పుడైనా ప్రజల నుంచి వచ్చిన సమస్యలు గాని కౌన్సిలర్ నుంచి వచ్చిన సమస్యలపై నేను గాని, కమిషనర్ గాని త్రాసపచ్చకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తూ కౌన్సిల్లో ప్రవేశ పెడుతున్నామని చెప్పారు. కౌన్సిలర్ దుర్గ శంకర్ పండ మాట్లాడుతూ ఎం బుక్ నమోదు చేయడం లేదని, బస్టాండ్ లో ఉన్న నిర్మాణాన్ని ఎంతవరకు పటిష్టంగా ఉందో లేదో చూడాలని చెప్పారు. దీనిపై మున్సిపాలిటీ అధికారులతో మేము కూడా పర్యవేక్షిస్తామని దీంతో ఎంతవరకు పటిష్టంగా ఉందో లేదో చెప్పచ్చని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పలు ప్రాంతాలు కు సచివాలయం నిర్మించేందుకు అవకాశం కల్పిస్తే వాటి నిధులు కూడా రావడం లేదని ధ్వజమెత్తారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ మీరు ఇచ్చిన సూచనలు పాటిద్దామని అని పేర్కొన్నారు. కౌన్సిలర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ నర్సిపురంలో ఇంటి వద్దకు నీరు చేరుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, డీఈ కనకరాజు, ఏఈలు అవినాష్, శ్రీధర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ఆర్.కె పురం పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన మామిడి

**కొత్తూరు, అక్టోబరు 29(వార్త):** ఆర్.కె.పురం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం స్వయంగా పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో ఇళ్లను కోల్పోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి మూడు వేలు చొప్పున ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు, మండల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో, పరిస్థితులు పూర్తిగా సాధారణం అయ్యే వరకు, పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి భోజనం, మందులు, అవసరమైన వస్తువులు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల కష్టాన్ని అర్థం చేసుకున్న ప్రభుత్వం బాధితుల వెంట నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## బాధితులకు ఆదివికాస పరిషత్ సాయం



**మందస, అక్టోబరు 29(వార్త):** సవరపద్మాపురంకాలనీలో గిరిజన కుటుంబాలకు చెందిన నాలుగు పూరిల్లు అగ్నికి పూర్తిగా కాలిపోయిన విషయం తెలుసుకుని, బాధిత కుటుంబాలకు ఆదివాసీ వికాస పరిషత్ తక్షణ సహాయం కింద నిత్యావసర సరుకులు, ఒక్కో కుటుంబానికి 25కేజీల బియ్యం సంచులు అందజేశారు. ఆ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం, ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ వికాస పరిషత్ గౌరవ అధ్యక్షుడు గణేష్, సలహాదారుడు సీతారాం, సభ్యులు జగ్గారావు, ఉమాబిస్వాల్, దుర్యోధన, కిరణ్, కామేష్, జోస్కెతన్, సోమేశ్, కామేష్, అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

## ఘనంగా గోవిందుడు జన్మదిన వేడుకలు



**కోటబొమ్మాళి, అక్టోబరు 29(వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కోటబొమ్మాళి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ గోవిందరావు పుట్టినరోజు వేడుకలు స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు సమక్షంలో కేకను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అంతకుముందు ఎన్టీఆర్ భవన్ లో ఉన్న ఉన్న ఎన్టీఆర్ ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు బోయిన సత్య శ్రీనివాస్, కొత్తమ్మ తల్లి ఆలయ చైర్మన్ కోరాడ గోవిందరావు, కోటబొమ్మాళి మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ, మాజీ ఉప సర్పంచ్ సకలా భక్తుల సునీత రామ్ కుమార్, కోటబొమ్మాళి కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు కోరాడ ప్రతాప్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సకలా భక్తుల లక్ష్మణ్ కుమార్, కోరాడ రాంలాల్ గుప్త ,సకలా అనిల్ , గణపతి బోయిన ద్వారఖానాద్ , బోయిన వెంకటరమణ , బోయిన కిషోర్ , లొట్టి రాహుల్ , కోరాడ అచ్యుతరావు తో తదితరులు పాల్గొన్నారు.

# తుపాను బాధిత ప్రాంతాల్లో కూటమి నాయకుల పర్యటన

**మందస, అక్టోబరు 29(వార్త):** మొంథా తుపాను బాధిత ప్రాంతాల్లో టీడీపీ, కూటమి నాయకుల పర్యటించారు. మందస మండలంలో ముంతా తుఫాన్ దాటికి అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో జీడి చెట్లు, కొబ్బరి చెట్లు పడిపోయిన విషయం తెలుసుకొని బేతాలపురం, రట్టి, లక్ష్మీపురం, వీరభద్ర, రంగనాథపురం తదితర గ్రామాల్లో రైతులతో కలిసి తోటల్లో పడిపోయిన జీడి, కొబ్బరి చెట్లను తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పరిశీలించారు. తితిలీ తుఫాన్ ధాటికి ఉద్దానం అతలాకుతలమై, ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న తరుణంలో మొంథా తుఫాన్ రూపంలో మరోసారి రైతులకు నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మందస మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈ సమస్యను స్థానిక పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తెలియజేస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త వెంకన్నచౌదరి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు భావన దుర్యోధన, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, సాలిన మాధవరావు, ముడిముంచి నవీన్ కుమార్, అవుగాన ఈశ్వరరావు, సురాడ వాసుదేవరావు, దున్న తిరుపతిరావు, జుత్తు అప్పలస్వామి, తిమ్మల హరికృష్ణ, పులారి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546